www.vishalabharati.com
epaper:vishalabharati.com


TELANGANA POLITRICKS

పాలిట్రిక్స్
2023-2024

విశాల భారతి
vishalabharathi
Telugu Daily
ఆదివారం,
17.09.2023
హైదరాబాద్
1.00 pm edition



# వి 'నాయక' రాజకీయం!



## రాష్ట్ర వ్యాప్తంగా గణనాథుడి ప్రతిమల బల్క్‌బుకింగ్

## వినాయక నవరాత్రి ఉత్సవాలకు వెన్నుదన్నుగా లీడర్లు

## ఎన్నికల ఎఫెక్ట్‌తో పోటా పోటీగా 'లంబోదరు'ల పంపిణీ

## 20 శాతానికి పైగా ధరలు పెంచిన తయారీదారులు

## రాష్ట్ర వ్యాప్తంగా మొదలైన ఉండ్రాళ్ల పండుగ సందడి

## రేపటి నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు షురూ

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో ప్రతినిధి:**

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేళ వినాయక చవితి రావడంతో.. పార్టీల ఫోకస్ గణేశుడి విగ్రహాలపై పడింది. పరోక్షంగా ఓటర్లను ప్రభావితం చేసేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు ఆశావహులు, ప్రతిపక్ష పార్టీల లీడర్లు ఉత్సవాలకు భారీగానే ఖర్చు చేస్తున్నారు. విగ్రహాల కొనుగోలు మొదలు నవరాత్రులు ముగిసే వరకు మండపాలకు అయ్యే ఖర్చు తామే భరిస్తామని తమ క్యాడర్‌కు హామీలు ఇస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో కొంత మంది లీడర్లు ముందస్తుగానే లక్షల రూపాయలు వెచ్చించి గణపతులను బల్క్‌బుకింగ్ చేసి ఇప్పటికే విగ్రహాలను పంచగా, మరి కొందరు నిర్వహణకు ఒక్కో మండపానికి రూ. 10 వేల నుంచి 20 వేల వరకు అందజేస్తామని చెప్తున్నారు. కొందరు ఏకంగా నిర్వాహకులు తాము ఇచ్చిన విగ్రహమే పెట్టాలని, విగ్రహాల ఎత్తుల విషయంలో, మండపాల వద్ద ఫ్లెక్సీల విషయంలో పోటీ పడుతున్నారని తెలుస్తోంది. దీంతో ఈసారి గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కనీవిని ఎరగని రీతిలో జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇలా రాజకీయ రంగు పులుముకోబోతున్న లంబోధరుడి నవరాత్రి ఉత్సవాలపై 'విశాల భారతి' ప్రత్యేక కథనం..

**ముందుగానే బల్క్‌బుకింగ్..**

గ్రేటర్ హైదరాబాద్ సహా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని విగ్రహాల తయారీ కేంద్రాల్లో వేల సంఖ్యలో గణేశుడి విగ్రహాలు మండపాలకు తరలివెళ్లేందుకు రెడీ అయ్యాయి. గణేశ్ విగ్రహాల తయారు చేసే.. మహారాష్ట్ర, కోల్‌కత్తా, ముంబై, రాజస్థాన్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వారు 20 ఏళ్ల కిందటే ఇక్కడికి వలస వచ్చి కుటుంబాలతో సహా స్థిరపడ్డారు. సుమారు వేల కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోని దూల్‌పేట, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో వేల సంఖ్యలో వినాయకుల విగ్రహాల తయారీ కేంద్రాలు ఉన్నాయి. వీరంతా గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఆరునెలల ముందు నుంచే విగ్రహాలను తయారు చేయడం మొదలు పెడతారు. ఈ యేడు ఎన్నికల ముందర వినాయకచవితి రావడంతో రాజకీయ నాయకులు ముందుచూపుగానే బల్క్‌గా వేల సంఖ్యలో గణేశ్ విగ్రహాలకు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆర్డర్లు ఇచ్చి తయారు చేయించుకున్నారు.

**అంతా తామేనంటూ లీడర్ల హామీ..**

నేటి నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ మండళ్లు రెడీ అవుతున్నాయి. మరో మూడు నెలల్లో ఎన్నికలు ఉండడంతో కిందటేడుకన్నా ఈ సారి భారీ సంఖ్యలో వినాయక మండళ్ల ఏర్పాటు జరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏటా సుమారు 4నుంచి 5 లక్షల వరకు వినాయక ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ఈ సారి వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఒక్క హైదరాబాలోనే లక్షకు పైగా గణనాథులు కొలువుదీరుతారు. ఎన్నికల సీజన్ అయినందువల్ల ఈసారి వీటి సంఖ్య ఇంకా పెరిగినా ఆశ్చర్యపోనక్కరలేదని తయారీ దారులు చెప్తున్నారు.

**బారులుతీరిన గణపతులు**

వినాయక చవితి దగ్గర పడుతుండంతో తయారీదారులు గణనాథుల విగ్రహాలను అమ్మకానికి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లోని దూల్‌పేట, ఆటోనగర్ తదితర ప్రాంతాలతో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో వినాయకుడి విగ్రహాలు దర్శనమిస్తున్నాయి. దూల్‌పేట, ఆటోనగర్‌ప్రాంతాల్లో ఇప్పటికే గణేశ్ విగ్రహాలను అమ్మకానికి పెట్టారు. నగర వ్యాప్తంగా శివారు ప్రాంతాల్లో హైవేల పక్కన ఫుట్‌పాత్‌లపై విగ్రహాలను అందుబాటులో ఉంచారు. మెజారిటీ గణపతుల విగ్రహాల హైదరాబాద్‌మహానగరంలోఎక్కువగా కొనుగోళ్లు చేస్తారు. వివిధ భంగిమల్లో, డిజైన్లలో, సైజ్‌ల్లో విగ్రహాలు దొరికేవి ఇక్కడే. రాష్ట్రంలోని ఉత్సవ మండళ్ల నిర్వాహకులే కాకుండా యువజన జనసంఘాలు, భక్తులు తమకు కావలసిన విఘ్నేషులను ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇప్పటికే దాదాపు 90 శాతం గణనాథులు మండపాలకు తరలినట్లు తెలుస్తోంది.

**పెరిగిన ధరలు**

వినాయక విగ్రహాల ధరలు కిందటేడుకన్నా 15 నుంచి 20 శాతం పెరిగాయి. ఒక్కో ఫీట్‌కు రూ.500 నుంచి రూ.1000 వరకు పెంచారు. కిందటేడు చిన్నవిగ్రహాలు రూ.100కు దొరకగా, ఈసారి వాటి ధర రూ.125కు పెరిగింది. ఒక అడుగు ఎత్తు విగ్రహం కిందటేడు రూ.750వరకు అమ్మకం కాగా, ఈసారి రూ.1000కుపైగా విక్రయిస్తున్నారు. మూడు అడుగుల ఎత్తు విగ్రహాల ధరలు రూ.2,550 నుంచి రూ.3,500 వరకు పెరిగాయి. నాలు గడుగులకు మించి ఉన్న విగ్రహాలు గతంలో రూ.4,500 నుంచి రూ.5వేల వరకు ధరపలికేవి. ఇప్పుడు వాటి ధర రూ.6వేలనుంచి రూ. 7వేల వరకు చెబుతున్నారు. ఆరడుగులు ఆపై ఎత్తున ఉన్న విగ్రహాల ధరలు రూ.20 వేల కన్నా తక్కువకు దొరకడం లేదు. ముడిసరుకు ధరలు పెరగడం వల్లనే విగ్రహాల ధరలను పెంచక తప్పడం లేదని తయారీదారులు చెప్తున్నారు.

**ప్రజల ఆదరణ పొందాలంటే తప్పదు..**

వచ్చే ఎన్నికల్లో ప్రజల మనసులో నిలవాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి వాటికి పూనుకోక తప్పడంలేదని ఓ పార్టీకి చెందిన నాయకుడు బహిరంగంగా చెప్పడం విశేషం. కాగా చాలా వరకు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు మాత్రం విగ్రహాల కొనుగోలుతో పాటు మండపాల ఏర్పాటు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు అంతా తామే భరిస్తామని నిర్వాహకులకు చెప్తున్నారు.

ఇదిలా ఉండడంతో ఎలక్షన్‌మానియాతో లీడర్లు ఫ్రీగా విగ్రహాలు పంచుతుండడంతో నల్గొండ పట్టణంలో ఈ సారి 30 ఇండ్లకు ఒక విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని తెలుస్తోంది. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 9 ఫీట్ల విగ్రహాలు పంచుతుంటే, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పది ఫీట్ల విగ్రహాలు ఇస్తున్నారు. తానేం తక్కువ కాదన్నట్లు బీఆర్ఎస్ అసమ్మతి నేత పిల్లి రామరాజు యాదవ్ ఏకంగా 11 ఫీట్ల విగ్రహాలు ఇస్తుండడంతో జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇక మండపాల పక్కన ఇప్పటి నుంచే పొలిటికల్ లీడర్ల బొమ్మలతో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండడం గమనార్హం.

### నేనిచ్చే విగ్రహమే పెట్టాలె..

ఎన్నికల వేళ విగ్రహాలు పంచేందుకు నేతలు పోటీ పడుతున్నారు. నేనంటే.. నేనే ఇస్తానంటూ పంతాలకు పోతున్నారు. నల్గొండ హనుమాన్‌నగర్‌లో ఏటా బడా గణపతిని ప్రతిష్టిస్తారు. ఈ సారి అక్కడ విగ్రహాన్ని ఇచ్చేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఇండిపెండెంట్, రేబల్ లీడర్లు పోటీ పడ్డారు. దీంతో నిర్వాహకులు డ్రా తీయాలని నిర్వహించారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్‌అసమ్మతి నేత పిల్లి రామరాజు యాదవ్ పేర్లతో డ్రా తీశారు. ఇందులో ఎంపీ వెంకట్‌రెడ్డి పేరు వచ్చింది. ఇంకేముంది బీఆర్ఎస్‌ఎమ్మెల్యేకు చిర్రెత్తింది. 'అసలు డ్రా ఎవడు తీయమన్నాడు మిమ్ములను' అంటూ ఉత్సవకమిటీపై చిందులు వేశారట. పైగా ఎవరొచ్చి పూజలు చేస్తారో.. చూస్తానంటూ వార్నింగ్‌కూడా ఇచ్చాడట. కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్‌ఆఫీసర్లు అడుగు పెట్టడానికి వీల్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారట.

# విజయభేరికి సర్వం సిద్ధం

## తుక్కుగూడకు కదులుతున్న తెలంగాణ పల్లెలు

## సభకు10 లక్షలకు మించి వస్తారంటున్న పీసీసీ నేతలు

## నగరంలో రెండో రోజు కొనసాగుతున్న సీడబ్ల్యూసీ మీటింగ్

## సాయంత్రం రాజీవ్‌గాంధీ ప్రాంగణానికి జాతీయ నేతలు

## హైలెట్ కానున్న అధినేత్రి సోనియా గాంధీ ప్రసంగం

## కాంగ్రెస్ ఎన్నికల శంఖారావంపై తెలంగాణలో ఆసక్తి



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో ప్రతినిధి:**

కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభకు సర్వం సిద్ధమైంది. ఇవాళ సాయంత్రం 4 గంటలకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ వేదికగా భారీ బహిరంగ సభను నిర్వహించబోతోంది. ఇప్పటికే రెండు రోజుల సీడబ్ల్యూసీ మీటింగ్స్‌లో భాగంగా వచ్చిన జాతీయ నేతలు హైదరాబాద్ లోనే ఉన్నారు రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు కూడా సమయం దగ్గర పడుతున్న వేళ కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు పదును పెట్టే పనిలో పడ్డారు. ఈ నేపథ్యంలో పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే సాయంత్రం సమరభేరికి హాజరుకానున్నారు. ఈ సభా వేదిక నుంచి సోనియా గాంధీ 6 గ్యారెంటీ హామీలను ప్రకటించనున్నారు. రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీతో కీలకమైన ప్రకటనలు చేయించటం ద్వారా.. బలమైన సందేశాన్ని ప్రజల్లోకి పంపాలని టీపీసీసీ భావిస్తోంది. ఇందులో భాగంగా తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే విషయానికి సంబంధించి 5 ప్రధాన హామీలను ప్రకటించనుంది. ఇప్పటికే పలు డిక్లరేషన్లను ప్రకటించిన కాంగ్రెస్.. విజయభేరి సభ వేదిక నుంచి ఎలాంటి ప్రకటనలు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ గ్యారంటీలలో ప్రధానంగా తక్కువ ధరకు గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, కర్ణాటకలో మాదిరిగా మహిళలకు ఉచిత ప్రయాణం, గృహలక్ష్మితో పాటు ఉద్యోగాల భర్తీ, ఎస్సీ ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ వంటి అంశాలు ఉంటాయని పార్టీ వర్గాల మేరకు తెలుస్తోంది. విజయభేరి బహిరంగ సభకు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ జనాన్ని సమీకరించేలా ప్లాన్ చేసింది. ప్రతి మండలం నుంచి జనాన్ని తరలించనుంది. ప్రధానంగా హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉన్న జిల్లాల నుంచి అధిక సంఖ్యలో జనాన్ని తరలించేలా కార్యాచరణను రూపొందించుకున్నారు. సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భారీ జన సమీకరణను నిర్వహిస్తున్నారు.

**కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో ఆసక్తి**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు టైమ్ దగ్గర పడుతున్నా, రాజకీయాలు ఆ స్థాయిలో వేడిగా లేవు. ఒక రకమైన స్తబ్ధత కనిపిస్తోంది. దానికి ఈ రోజు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. తెలంగాణ ప్రాంతం.. భారత సమాఖ్య వ్యవస్థలో విలీనమైన సందర్భాన్ని పురస్కరించుకొని.. ఎన్నికల శంఖారావం పూరించనుంది. తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ జోష్‌లో ఉన్న ఈ తరుణంలోనే ఎన్నికల రణరంగంలోకి దిగాలన్నది వ్యూహం. అందుకే ఏకంగా 10 లక్షల మందిని ఈ సభకు తరలించాలని ప్లాన్ చేసుకుంది. అంత మంది వస్తారా అన్నది పక్కన పెడితే.. ఈ సభ ద్వారా ప్రజలకు కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కీలక అంశాలను చెప్పబోతోంది. అందువల్ల కాంగ్రెస్ ఇవ్వబోయే హామీలపై ప్రజల్లో కొంత ఆసక్తి ఉంది.

**రాజీవ్‌గాంధీ నాలెడ్జ్‌సెంటర్‌కు శంకుస్థాపన**

అయితే విజయభేరి సభను పురస్కరించుకుని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చే ఆరు గ్యారంటీలను సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే ఈ సాయంత్రం బహిరంగ సభలో తెలియజేస్తారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చెప్పారు. అదేవిధంగా బోయిన్‌పల్లిలో ఉన్న రాజీవ్ గాంధీ ప్రాంగణం లోని పదిన్నర ఎకరాల స్థలంలో రాజీవ్ గాంధీ నాలెడ్జ్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌కు సోనియా గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ నలుమూలల నుంచి అన్ని వర్గాల వారు లక్షలాదిగా తుక్కుగూడ సభాస్థలికి తరలిరావాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

**బీఆర్ఎస్, ఎంఐఎం బీజేపీకి పరోక్ష మద్దతుదారులు**

సీడబ్ల్యూసీ సమావేశాలు ఇక్కడ ఏర్పాటు చేయడం తెలంగాణకు ఎంతో కీలకమని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ తరఫున జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్, ఎంఐఎం బీజేపీకి పరోక్ష మద్దతుదారులంటూ ఆరోపించారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన విధానాలపై నిన్న సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించామన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలపై ఇవాళ జరిగే సమావేశంలో చర్చిస్తామన్నారు. సాయంత్రం జరిగే విజయభేరిలో సోనియాగాంధీ గ్యారంటీలను ప్రకటిస్తారని.. బోయిన్ పల్లి రాజీవ్ గాంధీ నాలెడ్జ్ సెంటర్‌కు సభలోనే శంకుస్థాపన చేస్తారన్నారు.

**మొదటి వందరోజుల్లో పథకాలన్నీ అమలు**

తెలంగాణ ఇస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నట్టే.. ఇవాళ విజయభేరిలో ఇవ్వబోయే గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేస్తుందని రేవంత్ తెలిపారు. అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల్లో పథకాలు అన్నీ అమలు చేసేలా గ్యారెంటీ ఇవ్వబోతున్నామన్నారు. సాయంత్రం తుక్కుగూడలో జరిగే విజయభేరి సభకు లక్షలాదిగా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

### సోనియా గాంధీ ప్రసంగమే హైలెట్..!

ఈ సభలో సోనియా గాంధీ ప్రసంగం హైలెట్ కానుంది. ఆమె ద్వారానే ఆరు హామీలను ప్రకటిస్తారని తెలుస్తోంది. అవి రూ.500కే గ్యాస్ సిలిండర్, యువ వికాసం కింద 2 లక్షల ఉద్యోగాల భర్తీ, దారిద్ర్య రేఖకు కింద ఉన్న మహిళలకు మహాలక్ష్మి పేరుతో రూ.3 వేల పింఛను, చేయూత కింద రూ.4 వేల పింఛను, రైతు భరోసాగా రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, అంబేద్కర్ అభయహస్తం పేరుతో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల చొప్పన ఆర్థిక సాయం హామీలను ప్రకటిస్తారని తెలుస్తోంది.